క్లుప్తంగా

చలివేంద్రాల ఏర్పాటు



జనగామ: జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో డాక్టర్లు కె.రంజిత్‌కుమార్, విజయశ్రీ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిపో మేనేజర్ స్వాతి గురువారం ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులకు వాటర్ క్యాన్లు, జూట్ బ్యాగ్‌లు, వైట్ కాటన్ టవళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. విధి నిర్వహణలో ఉద్యోగులు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ జి.రాఘవేంద్ర, ఆఫీస్ సూపరింటెండెంట్ వై.యాదమ జీరావు, ఏఎంఎఫ్ కె.రవీందర్, స్టేషన్ మేనేజర్ ఎం.సమ్మయ్య, జి.హరిలాల్, అకౌంటెంట్, ట్రాఫిక్ ఏడీసీ టీబీఎస్‌రెడ్డి, సేఫ్టీ వార్డెన్ కె.సుందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు



జనగామ రూరల్: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పేర్కొన్నారు. మరిగడి గ్రామంలోని ప్రధాన చౌరస్తా వద్ద రామావత్ కనకలక్ష్మి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని కనకారెడ్డి గురువారం ప్రారంభించారు. బోడ నరేందర్, భూక్య చందునాయక్, ఉపేందర్, మిట్యా నాయక్, దాసగాని సుమ, యాకన్న రాథోడ్ పాల్గొన్నారు.

శివునిపల్లిలో..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో బరోడా బ్యాంకు సమీపాన స్నేహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు యంజాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాదారపు ధనుంజయ్, పుల్లూరి సోమేశ్వర్, పార్శి రంగారావు, మొగుదుంపురం కిషోర్, అక్కినపెల్లి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్, అధ్యక్షుడు

రఘునాథపల్లి: రఘునాథపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన నాసగోని శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో మండల పాత్రికేయులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ప్రధాన కార్యదర్శిగా కోడూర్ గ్రామానికి చెందిన చిట్యాల స్వామి, కోశాధికారిగా రఘునాథపల్లికి చెందిన ఇమ్మడిశెట్టి శివరాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన, విస్తరణ కార్యవర్గ సభ్యుడిగా యాదగిరి



యాదగిరిని అభినందిస్తున్న వీసీ జానయ్య

హన్మకొండ: పరిశోధన, విస్తరణ కార్యవర్గ సభ్యుడిగా జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కన్నాయిపల్లి గ్రామ రైతు మంతపురి యాదగిరి ఎంపికయ్యారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 48వ పరిశోధన విస్తరణ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మధ్య తెలంగాణ మండలం నుంచి మంతపురి యాదగిరి కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సమన్వయంతో రాష్ట్రంలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని, పత్తిలో మేలైన హైబ్రిడ్ విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని, గ్రామాల్లో కోతుల బెడదను అరికట్టాలని సూచించారు. యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య ఆధ్వర్యంలోని కార్యవర్గం చేపట్టిన పలు కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని కితాబిచ్చారు. కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన యాదగిరిని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, శాస్త్రవేత్తలు అభినందించారు.

హతవిధి.. ధాన్యం ఆరబోతకూ అద్దె

● హన్మంతాపూర్ రైతుల వెతలు



హన్మంతాపూర్‌లో పట్టాభూముల్లో ఆరబోసిన ధాన్యం

నర్మెట: రైతన్నకు ఎన్ని కష్టాలు. ధాన్యం ఆరబోసుకోవడానికి సైతం అద్దె చెల్లించాల్సిన దుస్థితిలో హన్మంతాపూర్ రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో హన్మంతాపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కాగా, వాతావరణ పరిస్థితుల భయంతో వర్షం ఎప్పుడు వస్తుందో తెలియక పచ్చిమీదనే వరికోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తరలించడంతో స్థలం సరిపోవడంలేదు. దీంతో పక్కనే ఉన్న ఐదు ఎకరాల పట్టాభూమి అనువుగా ఉండటంతో ఒక్కోరైతు యజమానికి రూ.1,000 చెల్లించి ఆ స్థలంలో ధాన్యం ఆరబోసుకుంటున్నారు. జన గామ మార్కెట్‌కు వెళ్లడం వ్యయప్రయాసలతో కూడుకున్నదని అధికారులు స్పందించి ధాన్యం ఆరబోసుకోవడానికి మరింత స్థలాన్ని సమకూర్చాలని రైతులు కోరుతున్నారు.

ఎటు చూసినా బాగలేదు..



ఎటు చూసినా బాగలేదు. కంకి పచ్చిమీదనే ఉంది. వర్షం వస్తుందనే భయంతో కోసుకొచ్చినం. ఇక్కడ ఆరబోద్దామంటే జాగాలేదు. పక్క భూమి ఆయనకు వెయ్యి రూపాయలు ఇచ్చి ఆరబోసుకుంటున్నం.

– బానోత్ స్వరూప, రైతు, బద్యతండా, హన్మంతాపూర్

ఏం చేస్తం..



ఏళ్ల సంది గిదే పరిస్థితి. వానొస్తే రాలిపోతయని భయం.. పచ్చిమీద కోసుకొస్తే ఆరబోసుకోవడానికి జాగా లేదు. ఏం చేస్తం. చిన్నకుప్పకు రూ. 500, పెద్ద కుప్పకు రూ.1,000 ఇయ్యాల్సిందే. అధికారులు ఆదుకోవాలి.

– మ్యాక సారయ్య, రైతు, హన్మంతాపూర్

అక్రమ అరెస్టులు, ఎన్‌కౌంటర్లకు కేరాఫ్ కడియం

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్: నీతి, నిజాయితీ అంటూ ప్రగల్భాలు పలికే స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చరిత్ర ప్రజలందరికీ తెలిసిందేనని, అవినీతి, అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లకు కేరాఫ్ కడియం అని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను పురస్కరించుకుని ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో, జఫర్‌గఢ్‌లో ఆర్యవైశ్య భవనంలో గురువారం నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. మొదటి నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ గడ్డ తెలంగాణ ఉద్యమానికి, బీఆర్ఎస్ పార్టీకి అడ్డాగా ఉందన్నారు. 2004 నుంచి 2024వరకు 20 ఏళ్ల పాటు కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా లేడని, అభివృద్ధి చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అధికార పక్షానికి కొమ్ముకాస్తూ అక్రమ అరెస్టులు చేస్తే సహించేది లేదన్నారు. నీతి, నిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని, కడియంను రాజకీయ సమాధి చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు కంకణబద్ధులై ఉన్నారన్నారు. ఆయా సమావేశాల్లో పార్టీ మండలాల అధ్యక్షులు మాచర్ల గణేష్‌గౌడ్, జైపాల్‌రెడ్డి,, మాజీ జెడ్పీటీసీ మారపాక రవి, నాయకులు ఆకుల కుమార్, చల్లా చందర్‌రెడ్డి, తాటికొండ సురేష్‌కుమార్, మాజీ ఎంపీపీలు గట్టెట బుచ్చయ్య, మారపాక రవి తదితరులు పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

దేవరుప్పుల : నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఎర్రబెల్లి దయాకర్ రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21న పాలకుర్తి బృందావన్ గార్డెన్‌లో చేపట్టే జాబ్ మేళాకు 100కు పైగా కంపెనీల ద్వారా 5 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, ఫార్మసీ, డిప్లొమా అర్హత కలిగి వయసు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు అర్హులని, మరిన్ని వివరాలకు 8978710201 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రాణాలతో ప్రభుత్వ వైద్యుల చెలగాటం

● సీపీఎం, బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

పాలకుర్తి టౌన్: ప్రజల ప్రాణాలతో ప్రభుత్వ వైద్యులు చెలగాటం ఆడుతున్నారు.. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పసికందు మృతికి కారణమైన వైద్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ అస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. డెలివరీ కోసం వచ్చిన లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన యాట అర్చన గర్భంలోనే పసికందు మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అర్చనను పరామర్శించిన నాయకులు అనంతరం ధర్నాలో మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓను కలిసి ఆస్పత్రిలో గతంలో జరిగిన సంఘటల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య, సోమ సత్యం, నాగయ్య, సంపత్, కుమార్ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్య తీసుకుంటాం : ఎమ్మెల్యే

యాట అర్చన గర్భంలోనే పసికందు మృతి చెందిన ఘటనపై ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గురువారం స్పందించారు. బాధిత కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించిన ఆమె ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని, అలాగే బాధిత కుంటుబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం ఆదుకోవాలి : ఎర్రబెల్లి

పసికందు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి దయాకర్‌రావు లక్ష్మీనారాయణపురంలో పరామర్శించారు. పసికందు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రసవం చేయకుండా వైద్యులు నిర్లక్ష్యం చేసినందునే పసికందు మృతి చెందినట్లు ఆరోపించిన ఆయన బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

'దాడిని ఖండిస్తున్నాం'



మాట్లాడుతున్న మోహనకృష్ణభార్గవ

జనగామ: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మోహనకృష్ణభార్గవ అన్నారు. గురువారం నిరసన తెలిపిన అనంతరం మాట్లాడుతూ బెంగాల్‌లో హిందువుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందని, ఆ రాష్ట్రాన్ని వదిలి పారిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. కేంద్రం స్పందించి రాష్ట్రపతి పాలన అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సుంచు శ్రీకాంత్, నాగరాజు, క్రాంతికుమార్, హర్షవర్ధన్, సోమిరెడ్డి, భైరునాథ్, నాగరాజురెడ్డి, వెంకటేష్, రమేష్‌రెడ్డి, నాగేష్, వివేక్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ అరవింద్ చౌదరి

నర్మెట: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాగితపు ప్లేట్లతో పాటు ప్లాస్టిక్ పదార్థాలను నిషేధించాలని ఎంపీడీఓ బోడపాటి అరవింద్ చౌదరి అన్నారు. కన్నె బోయినగూడెం జీపీ, ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గ్రామాల్లో, పట్టణాల్లో నిర్వహించే ప్రతీ చిన్న కార్యక్రమాలకు యూజ్ అండ్ త్రో గ్లాసులు, ప్లేట్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, వాతావరణం పూర్తిగా కాలుష్యం కాకముందే మనం మేల్కొనాలని అన్నారు. ఈ స్టీల్ బ్యాంక్ నుంచి తక్కువ ధరలకే అద్దెకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు. గిన్నెలు లభిస్తున్నాయని వాటిని వినియోగించుకుని పార్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలని అన్నారు. స్వచ్ఛభారత్ , హరిత గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని అన్నారు. కార్యదర్శులు గణేష్, అనిల్‌రెడ్డి, సీసీ కుమార్, ఐకేపి సిబ్బంది, కారోబార్ పిల్లి సిద్దులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి



చిల్పూరు: మాట్లాడుతున్న హెచ్‌ఎం కన్నయ్య

కొడకండ్ల/స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట/చిల్పూరు/ జఫర్‌గఢ్: మాతా శిశు సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపరువైజర్లు, హెచ్‌ఎంలు అన్నారు. పోషణ పక్షోత్సవాలను పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం తల్లులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టిహారంపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మనోహర రమాదేవి, అనిత, హెచ్‌ఎం సోమయ్య, అంగన్‌వాడీ టీచర్లు, కవిత, మల్లిక, దారం లక్ష్మీ, గోనెల విజయ, గంట శ్రీనివాస్‌ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అంజయ్య సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న ప్రముఖులు

జనగామ: జనగామ పట్టణ ప్రగతితో పాటు ఈ ప్రాంతంలో విద్యా వ్యాప్తి కోసం కృషి చేసిన మాజీ ప్రిన్సిపాల్ కాసం అంజయ్య సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం జిల్లా కేంద్రంలోని గాయత్రీ గార్డెన్‌లో లయన్స్ క్లబ్ జనగామ అధ్యక్షుడు వై.సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన అంజయ్య దశదినకర్మ, సంతాప సభకు విద్యావేత్తలు, ప్రముఖులు, అన్ని వర్గాల ప్రజలు, పూర్వ, ప్రస్తుత విద్యార్థులు హాజరై ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు మాట్లాడుతూ మాజీ మంత్రి యతిరాజారావు హయాంలో ఏబీవీ డిగ్రీ ప్రైవేట్ కళాశాల ఏర్పాటు చేసి ఎయిడెడ్‌గా మారేందుకు అంజయ్య ఎంతో కృషి చేశారన్నారు. విద్యాభివృద్ధితో పాటు పట్టణ అభివృద్ధికి, హిందీ శిక్షణ కళాశాల స్థాపన కోసం పాటుపడ్డారన్నారు. రిటైర్డ్ లెక్చరర్ మాచర్ల రాములు మాట్లాడుతూ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన అంజయ్య పేరును ఏబీవీ డిగ్రీ కళాశాలకు పెట్టాలని తీర్మానం ప్రవేశ పెట్టగా, ఏగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పోకల జమున లింగయ్య, కేయూ మాజీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ వంగాల గోపాల్ రెడ్డి, విశ్రాంత ఆచార్యులు ఎస్.ఎం.రెడ్డి, వి.ప్రసాద రావు, హనుమాండ్ల రాజిరెడ్డి, గుర్రం శ్రీనివాసరెడ్డి, బంధు మిత్రులు తదితరులు సభలో పాల్గొని రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడి మృతి



నాగరాజు (ఫైల్)

రఘునాథపల్లి: విద్యుదాఘాతానికి గురైన మేకలగట్టు గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు వేల్పుల నాగరాజు (38) గురువారం మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేకలగట్టు గ్రామానికి చెందిన నాగరాజు 13 ఏళ్లుగా గ్రామంలో కారోబార్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన గ్రామంలో నాగరాజు విద్యుత్ స్తంభాలు ఎక్కి వీధిలైట్లు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. బుధవారం నాగరాజును గ్రామానికి తీసుకెళ్లగా ఉదయం ఇంటివద్ద మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నరేష్ తెలిపారు. కాగా, పేదరికానికి చెందిన మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గడ్డమీది సంధ్యారాణికిరణ్, మాజీ ఎంపీటీసీ బానోతు భిక్షపతినాయక్‌లు కోరారు.

చికిత్స పొందుతున్న మహిళ..

స్టేషన్‌ఘన్‌పూర్: మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివునిపల్లికి చెందిన దార సంతోష(60) గురువారం సాయంత్రం మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. శివునిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సంతోష వ్యక్తిగత పనులపై ఈనెల 15వ తేదీన వివేకానందచౌరస్తా వద్ద కిరాణాషాపుకు నడుచుకుంటూ వెళ్తుంది. అదేసమయంలో అటుగా వెళ్తున్న పల్సర్ బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు తెలుపగా చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి సోదరుడు ఆశీర్వాదం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి..

నర్మెట: చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందిన సంఘటన అమ్మాపురంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. దొంతరబోయిన అనిల్ (20) రోజూవారి కూలిపనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. అనిల్ తన సంపాదన ఇంట్లో ఇవ్వకపోవడంతో ఆదివారం తల్లి మందలించడంతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు ఎంజిఎంకు తరలించారు. డాక్టర్ల సూచన మేర మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ మేడిపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయమై పోలీసులను వివరణకోరగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉంది.

శివపార్వతుల శావ ఊరేగింపు



ఊరేగింపులో పద్మశాలీలు

దేవరుప్పుల: మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉప్పల మల్లన్న జాతరను పురస్కరించుకుని శివ నామస్మరణంతో పురవీధుల్లో పద్మశాలీలు తదితరులు శివపార్వతుల శావను ఊరేగించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం ఉదయం స్థానిక భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో పెద్దాపురం వెంకటేశ్వశర్మ పర్యవేక్షణలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకముతో మొదలై వాస్తు హోమం, గ్రామ బరిహరణం, శాంతి కుంభ స్థాపన, నీరాజ మంత్రపుష్పముల వంటి ప్రత్యేక అభిషేకం పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే స్పందిస్తే ఆస్తి నష్టం తగ్గింపు

పాలకుర్తి టౌన్: జాతీయ అగ్నిమాపక భద్రతా వారోత్సవాల సందర్భంగా గురువారం మండల కేంద్రంలో పాలకుర్తి అగ్నిమాపక కేంద్రం అధికారి సీహెచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది రామయ్య, నాగరాజు, అశోక్, ప్రశాంత్, ప్రదీప్‌కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన

చిల్పూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం చిన్నపెండ్యాల గ్రామంలోని పెట్రోల్‌బంక్‌లోని సిబ్బందికి ఎల్‌పీజీ గ్యాస్‌తో ఏర్పడే అగ్ని ప్రమాదాలపై స్టేషన్‌ఘన్‌పూర్ అగ్నిమాపక కేంద్రం అధికారులు అవగాహన కల్పించారు. లీడింగ్ ఫైర్‌మెన్ లింగయ్య, అగ్నిమాపక సిబ్బంది సురేందర్, గణేష్, కృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

జనగామ రూరల్: ఈ నెల 19వ తేదీన జనగామ ప్రాంతానికి చేరుకునే మహిళా హక్కుల పరిరక్షణ యాత్రను జయప్రదం చేయాలని ఐద్వా మహిళ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇర్రి అహల్య, ఎండీ షబానా పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు.

నిబద్ధతతో పని చేస్తేనే గుర్తింపు



యుగేందర్‌ను సన్మానిస్తున్న శివశంకర్

బచ్చన్నపేట: ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పని చేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శివ శంకర్ అన్నారు. గురువారం బ్రాంచిలో పని చేసి హైదరాబాద్‌కు బదిలీ అయిన అసిస్టెంట్ మేనేజర్ ఆరేళ్ల యుగేందర్, క్యాషియర్ స్వరాజ్‌లకు వీడ్కోలు పలుకుతూ నూతన ఏబీఎం తిరుపతికి స్వాగతం పలికి శాలువాలతో సన్మానం చేశారు. సందెల కవిత, సద్ది లలిత, మోకు తార, శాంతిప్రియ, ప్రమీల, దాచేపల్లి కవిత, లావణ్య, సుమలత, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా బాధితుల ఇంటికి సీఎం సహాయ నిధుల చెక్కులు అందిస్తున్నామని లకావత్ తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోడ యాకన్న అన్నారు. గురువారం మండలంలోని లాకావత్‌తండా(డీ)లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి సూచనల మేరకు ఆజ్మీరా లక్ష్మి(హరియా)కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.60 వేల చెక్కును ఆయన అందజేశారు. బోడ రవి, రాజేందర్, మాజీ సర్పంచ్ కవిత, మాజీ వార్డు సభ్యురాలు సునీత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

బచ్చన్నపేట: గ్రామాలలో అందరికి అనుకూలంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఇటుకాలపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని క ఓరారు. సెకండరీ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిబాట..

తరిగొప్పుల: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఉచిత విద్యతో పాటు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫామ్స్ అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బానోత్ రవీందర్ అన్నారు. వార్షిక పరీక్షలు ముగిసినందున మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుజాత ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు మంజుల, సునిత, జోసఫ్ బేబి, లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ టీచర్ సంతోష, సీఆర్పీ మహాలక్ష్మి పాల్గొన్నారు.

'సీఎం పదవి దక్కాలంటే అర్హత ఉండాలి'

కొడకండ్ల: సీఎం పదవి దక్కాలంటే అర్హత ఉండాలే సీనియారిటీ కాదని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మసురం రవీందర్, మార్కెట్ డైరెక్టర్ దేశగాని నాగరాజు అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఏడుసార్లు ఎమ్మెల్యే అయినా సీఎం కాలేదని, మూడు సార్లు ఎమ్మెల్యే అయిన రేవంత్ రెడ్డి సీఎం అయ్యాడని ఈర్ష పడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచి సీఎం అయిన ఎన్‌టీఆర్‌పై వైఖరిని స్పష్టం చేయాలని వారు కోరారు. సీఎం కావాలంటే అర్హత, అవకాశం రావాలే తప్ప సీనియారిటీ కాదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి అసెంబ్లీ, పార్లమెంట్ ఫలితాలే రావడం కాయమని వారు చెప్పారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

పాలకుర్తి టౌన్: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపై ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయలలో ఆయన మట్లాడారు. దయాకర్‌రావుకు మహిళపట్ల ఎంతో గౌరవం ఉందని, మీ కుటుంబ వ్యవహారాలతో తమ పార్టీకి, నాయకులకు ఎలాంటి సంబంధనం లేదని అన్నారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

తరిగొప్పుల: రాష్ట్ర ఖజానాలో నిలిచిన గత సంవత్సరం జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని గ్రామపంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామపంచాయతీల జీపీ కార్మికులు, సిబ్బంది ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ మాలతికి గురువారం వినతిపత్రం అందజేశారు. జల్లి సిద్దిరాములు, రాజకొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు

దేవరుప్పుల: సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాల ఐదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. గురువారం ఆ పాఠశాల హెచ్‌ఎం అంబటి అంజయ్య అధ్యక్షతన వీడ్కోలు, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రిటైర్డ్ హెచ్‌ఎం వనమాల రమేష్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యతోనే ఉన్నత విద్యలో రాణిస్తూ ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకుంటారని అన్నారు. టీచర్లు మాధవి, చైతన్య, సునీత, ఆయా సోమలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి టౌన్: గూడూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు మోడల్ వేణు ప్రమాదావశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గాయపడిన ఘటన గురువారం సాయంత్రం జరిగింది. గాయపడిన గీత కార్మికుడు వేణుకు కాలు విరిగి, తలకు తీవ్రగాయలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పతికి తరలించారు. బాధిత గీత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు పూజారి కుమార స్వామి, ఉపాధ్యాక్షుడు పొన్నం సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రమాదవశాత్తు ఆయిల్‌పామ్ తోట దగ్ధం

నర్మెట: మండల కేంద్రంలోని కంచె, మచ్చుపహాడ్‌లోని ఆయిల్‌పామ్ తోట ప్రమాదవశాత్తు అంటుకుని దగ్ధమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మండలకేంద్రానికి చెందిన బండి నాగరాజు కంచె, మచ్చుపహాడ్‌కు చెందిన గొల్లపల్లి కుమార స్వామికి చెందిన ఆయిల్ పామ్‌తోటను గుర్తుతెలియని దుండగులు దగ్ధం చేయడంతో డ్రిప్ పైపులు సైతం అగ్నికి ఆహుతయ్యాయని, దుండగులపై చర్యలు తీసుకోవాని బాధితుడు కోరారు. ఘటనాస్థలానికి చేరుకున్న జనగామ ఫైర్ సిబ్బంది కంచె మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ బోల్తా

బచ్చన్నపేట: మామిడి కాయల లోడుతో వెళ్తున్న లారీ మండలంలోని ఆలింపూర్ గ్రామం వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడిన సంఘటన గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి మధ్యప్రదేశ్‌కు మామిడి కాయల లోడ్‌తో వెళ్తున్న లారీ ఆలింపూర్ గ్రామం వద్ద ఉన్న మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడినది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లకు గాయాలు అయ్యాయి.